## ఇంటర్ విద్యార్థులకు ఎమ్మెల్యే భరోసా

కాప్రా: ఇంటర్ విద్యార్థులు పరీక్ష సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతవంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు. మీ భవిష్యత్తుకు ఇది కీలకమైన మలుపు అని, ఇన్నాళ్లు పడిన కష్టానికి తప్పకుండా తగిన ఫలితం దక్కుతుందని ఆకాంక్షించారు. పరీక్ష సమయానికి ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

## రాష్ట్రస్థాయి కరాటేలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో పాఠశాల చైర్మన్ నవనీతరావు

మల్లాపూర్: రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ 2025 పోటీలో డక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. 8 మంది విద్యార్థులకు పసిడి పతకాలు, 3 రజతం, 2 కాంస్యం సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులను పాఠశాల చైర్మన్ నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్ సుమామీనన్ అభినందించారు. కరాటే మాస్టర్లు శ్రీహన్, శ్రీప్రసాద్ తదితరులున్నారు.

## దళిత సంఘాల జేఏసీ కన్వీనర్‌గా కరాటే శ్రీరామ్



మల్లాపూర్: నాచారం దళిత సంఘాల జేఏసీ కన్వీనర్‌గా నాచారం వీరారెడ్డినగర్‌కు చెందిన కరాటే శ్రీరామ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం దళిత సంఘాల జేఏసీ సలహాదారులు నల్లారాధాకృష్ణ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ.. దళిత సంఘం జేఏసీని ఉప్పల్ నియోజకవర్గ వ్యాప్తంగా బలోపేతం చేస్తానన్నారు. త్వరలో నాచారం డివిజన్ పూర్తిస్థాయి కమిటీ వేయనున్నట్లు పేర్కొన్నారు.

## పేదలకు చేయూత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మిర్జాలగూడ రాజశ్రీనివాసనగర్‌కు చెందిన మాజీ సైనికుడు సత్యనారాయణ సేవాకార్యక్రమంలో భాగంగా మంగళవారం తన నివాసంలో పేదమహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సేవతోనే సంతృప్తి ఉందని ఆయన పేర్కొన్నారు.

## కొండ పోచమ్మ ఆలయ నూతన కమిటీ

బోడుప్పల్: కొండ పోచమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షులుగా జడిగె బాలయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శిగా వల్లపు ఐలేష్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా రాసాల సత్యనారాయణయాదవ్, గుర్రాల భాస్కర్‌యాదవ్, తోటకూర విజయ్‌యాదవ్, జనిగె శివయాదవ్, కోశాధికారిగా తోటకూర సురేష్‌యాదవ్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏనుగు వేణుయాదవ్ ఎన్నికయ్యారు.

## గుండెపోటుతో జర్నలిస్టు మృతి

కాప్రా: ఓ టీవీ రిపోర్టరుగా విధులు నిర్వహిస్తున్న జర్నలిస్ట్ కమల్ సంతోష్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఏఎస్‌రావునగర్ డివిజన్ రాధిక చౌరస్తా సమీపంలో గాయత్రినగర్‌లో నివాసం ఉంటున్న అతడికి ఉదయం ఛాతిలో నొప్పి రావడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందారు. ఆయన మరణవార్త తెలుసుకున్న కాప్రా ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ తరపున రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

## ఐద్వాల ముందస్తు అరెస్ట్



మల్కాజిగిరి: మహిళలకు అండగా ఉంటామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మహిళను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని ఐద్వా మల్కాజిగిరి కార్యదర్శి మంగ అన్నారు. మంగళవారం అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శోభారాణితో పాటు పలువురిని ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని అరెస్టులతో తమను అడ్డుకోలేరన్నారు. రమాదేవి, శ్రీదేవి, స్వప్న, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# రైల్వేస్టేషన్‌లో రక్షణ కరువు !

● తరచుగా ప్రయాణికులపై దాడులు ● సెల్‌ఫోన్లు, డబ్బులు లాక్కుంటున్న దుండగులు ● భయాందోళనలో ప్రయాణికులు



ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్

ఘట్‌కేసర్ : రైల్వేస్టేషన్ నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో ఇక్కడి నుంచి ప్రయాణించేవారికి రక్షణ కరువైందని ప్రయాణికులు వాపోతున్నారు. రైల్వేభద్రత సిబ్బంది విధులు ముగించుకుని ఇంటికెళ్లిన అనంతరం దుండగులు తమ చేతివాటం చూపిస్తున్నారు. దీంతో రాత్రుళ్లు వచ్చే ప్రయాణికులకు భద్రత కరువైంది.

### దూర ప్రాంతాల ఎక్స్‌ప్రెస్ రైళ్లు..

ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్–వరంగల్ కాకతీయ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–ఖాజీపేట్ పుష్‌పుల్, సికింద్రాబాద్–రేపల్లె, సికింద్రాబాద్–భద్రాచాలం రోడ్డు కాకతీయ ఎక్స్‌ప్రెస్‌లు నిలుస్తాయి.

### రక్తం వచ్చేలా దాడులు..

సికింద్రాబాద్‌లో రైలు పేరు తెలుసుకోకుండా కొందరు మద్యం మత్తులో మరికొందరు ప్లాట్‌ఫామ్‌పై ఉన్న రైలెక్కి ఘట్‌కేసర్‌లో దిగుతుంటారు. అర్ధరాత్రి రైల్వే భద్రత సిబ్బంది లేకపోవడంతో కొందరు దుండగులు రక్తం వచ్చేటట్లు ప్రయాణికులపై దాడులకు పాల్పడుతున్నారు. వారి దగ్గరున్న డబ్బులు లాక్కొని పోలీసులకు సమాచారం ఇవ్వకుండా సెల్‌ఫోన్లు కూడా తీసుకుంటున్నారు.

### కిటికీ దగ్గరుండే వారే టార్గెట్..

రైలులో నిలబడి, కిటికీ దగ్గరుండి చాలామంది ఫోన్ చూస్తుంటారు. ఈ క్రమంలో స్టేషన్‌లో ఆగి తిరిగి రైలు ప్లాట్‌ఫామ్ వీడే సమయంలో చివర ఉండి ఫోన్లు లాక్కున్న ఘటనలు కోకొల్లలు. రైల్వేస్టేషన్ గంజాయికి అడ్డాగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


దుండగుల దాడిలో గాయపడిన వ్యక్తులు (ఫైల్)

### దాడి చేసి దుస్తులు లాక్కెళ్లి..

ప్రస్తుతం ప్రయాణికులు, మహిళలు, వృద్ధుల కోసం విశ్రాంతి గదులు కూడా అందుబాటులో లేవు. నెల రోజుల క్రితం మల్కాజిగిరి సఫీల్‌గూడకు చెందిన ఇద్దరు వ్యక్తులు గుర్తు తెలియని రైలెక్కి అర్ధరాత్రి ఘట్‌కేసర్‌లో దిగాల్సి వచ్చింది. ఆ సమయంలో అక్కడికి కొందరు వచ్చి దాడిచేసి డబ్బు, ఫోన్లు లాక్కున్నారు. స్టేషన్ దాటి బయటకు రాకుండా ఓ వ్యక్తి ప్యాంటు కూడా లాక్కున్నారు. బాధితుడు ఉదయం వరకు ఉండి స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం 108 సిబ్బంది వచ్చి స్థానిక ఆసుపత్రిలో వైద్యం చేయించారు.

### సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి..

రైల్వేస్టేషన్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంతో ప్రయాణికుల భద్రతకు కరువైంది. ప్రయాణికుల పేరుతో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రక్షణ కల్పించాలని కోరుతున్న రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో గట్టి భద్రత ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### రక్షణ కల్పించాలి...



రైల్వేస్టేషన్‌లో సీసీకెమరాలు లేకపోవడంతో ప్రయాణికులపై దాడులు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. అప్పుడే ప్రయాణికులకు భద్రత ఉంటుంది.

– వేముల సాగర్, ప్రయాణికుడు

### ప్రత్యేక సిబ్బందిని నియమించాలి...



ప్రయాణికుల్లో అభద్రత భావం పెరిగిపోతోంది. వారు ప్రశాంతంగా రైల్వేస్టేషన్‌లోకి రావాలంటే భద్రత సిబ్బందిని ఏర్పాటు చేయాలి. రాత్రుళ్లు విధులు నిర్వహించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలి.

– రాంరెడ్డి, స్థానికుడు

### అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా...



అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రైల్వేస్టేషన్ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. భద్రత సిబ్బంది లేకపోవడంతో గంజాయి సేవించి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై రైల్వే అధికారులు స్పందించాలి.

– ఖలీల్, స్థానికుడు

# ఎల్ఆర్ఎస్‌పై ప్రత్యేక సమావేశం

మేడిపల్లి: పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో కార్యాలయంలో కమిషనర్ త్రిలేశ్వర్‌రావు ఆధ్వర్యంలో స్థానిక ప్రణాళిక అధికారులు, డెవలపర్స్, వివిధ కాలనీల సంఘాలతో ఎల్ఆర్ఎస్–2020పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. అనధికృత లేఅవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు 2020లో స్వీకరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. మార్చి 31 వరకు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని రాయితీని పొందాలని సూచించారు.


మాట్లాడుతున్న కమిషనర్ త్రిలేశ్వర్‌రావు

## చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

మల్లాపూర్: చేనేత కార్మికులకు అండగా నిలుస్తామని హైదరాబాద్, తెలంగాణ పద్మశాలి సంక్షేమ సంఘం కన్వీనర్ మల్లేష్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. చేతివృత్తులకు ఆదరణ కరువై ఆత్మహత్యలకు పాల్పడుతున్న పద్మశాలిలకు అండగా నిలుస్తున్నందుకు జీహెచ్ఎంసీ కన్వీనర్‌గా మల్లేష్‌ను నియామిస్తూ ఉత్తర్వులను అందజేశారు. రాష్ట్ర అధ్యక్షులు రాజ్‌కుమార్, గౌరవ అధ్యక్షులు వేముల బాలరాజు, చీఫ్ అడ్వైయిజర్, రమేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి బింగి నవీన్ తదితరులున్నారు.

## అటకెక్కిన క్రిస్టియన్ భవన్ నిర్మాణ పనులు !

ఉప్పల్: క్రిస్టియన్ ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులను అటకెక్కించిందని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ రాజీవ్‌సాగర్ అన్నారు. మంగళవారం ఉప్పల్ భగాయత్‌లో నిర్మాణంలో ఉన్న క్రిస్టియన్‌భవన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఉప్పల్ భగాయత్‌లో రెండెకరాల స్థలం కేటాయించి, రూ.10 కోట్లు మంజూరు చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో భవన నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అనీమియాపై అవగాహన

అల్వాల్: అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ యాకేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య కేంద్రం స్టాఫ్ నర్సులు, ఆశావర్కర్లు, సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ముక్త భారత్ అనీమియాలో భాగంగా చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు రక్తహీనత తగ్గించే దానిపై అవగాహన కల్పించారు. ఆరోగ్యకేంద్రం సూపర్‌వైజర్లు మరియరాణి, అరుణ, జంగయ్య, ఆశావర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ యాకేందర్‌రెడ్డి

## డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ


స్కానింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఉమాగౌరి

అల్వాల్: నేరేడ్‌మెట్ వాయుపురిలోని ప్యూర్ ఆర్థో ఆసుపత్రి, శ్రీరక్షా ఆసుపత్రిని మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ ఉమాగౌరి తనిఖీ చేశారు. ఆసుపత్రిలో స్కానింగ్ యంత్రాన్ని పరిశీలించి పలు పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆసుపత్రిలో నమోదిత ధ్రువపత్రాలు, పీసీపీఎన్‌డీటీ చట్ట నిబంధనలకు అనుగుణంగా నిర్వహణ జరుగుతుందన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం అన్ని అవసరమైన పత్రాలను కనీసం రెండేళ్లు భద్రపరచడం తప్పనిసరి అని చెప్పారు. పలువురు డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ నేతల సంబరాలు

మౌలాలి: ఉమ్మడి కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీగా మల్క కొమరయ్య విజయం సాధించిన నేపథ్యంలో మంగళవారం బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. వినాయకనగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు డివిజన్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ నేతలు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం బాణాసంచా కాల్చారు. మాజీ కౌన్సిలర్ ఆనంద్ గౌల్కర్, నేతలు నర్సింగ్‌రావు, భజరంగ్‌నవీన్ జగదీష్, జయమ్మ, సుశీల, శంకర్‌గౌడ్, వెంకటేష్, లత, కృష్ణప్రసాద్, రాము, సాయికిరణ్, స్వామి, ప్రకాష్, భాగ్యమ్మ, సత్యమ్మ పాల్గొన్నారు.



## రేపు దేవతావిగ్రహాల ప్రతిష్ఠాపన

రామంతాపూర్ : ప్రధాన రహదారిలోని కట్టమైసమ్మ దేవాలయంలో గురువారం విజయగణపతి, కాశీ విశ్వేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవతావిగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బండారు వెంకటరావు తెలిపారు. ఈ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఎంపీ ఈటల రాజేందర్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

## విద్యారంగ సమస్యలపై గళమెత్తాలి

కాప్రా: ఎమ్మెల్సీగా ఎన్నికైన మల్క కొమరయ్య చట్టసభల్లో విద్యారంగ సమస్యలపై గళమెత్తాలని ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్ కోరారు. ఆయన చైర్మన్‌గా ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ సంస్థలు నడిపే వ్యక్తులే ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతున్నారని, వాళ్ల వ్యాపార సామ్రాజ్యాన్ని కాపాడుకోవాలనే ఆలోచనతోనే వారు ఉంటున్నారని ఆరోపించారు.

మల్లాపూర్: టీచర్స్ ఎమ్మెల్సీగా గెలిచిన మల్కా కొమరయ్య ప్రభుత్వ విద్యారంగ సమస్యలపై గళమెత్తాలని మేడ్చల్ జిల్లా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) కార్యదర్శి సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం మల్లాపూర్‌లో ఏఐవైఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొమరయ్య చైర్మన్‌గా ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసి ఎస్సీ,ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉచిత సీట్లు కేటాయించాలని కోరారు. అఖిల భారత యువజన సమాఖ్య నేతలు రాజుకిరణ్, నదీమ్, మనోహర్, రమేష్, కీర్తన్ పాల్గొన్నారు.




# పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మల్లాపూర్: నాచారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న నాచారం పెద్ద నాలాకు అడ్డుగా ఉన్న తాగునీటి పైపులైన్‌ను తొలగించాలని, జలమండలి జీఎంను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. మంగళవారం నాచారంలోని పెద్ద నాలాపై రూ.94లక్షలతో నిర్మిస్తున్న పనులను స్థానిక కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాలా పనులకు అడ్డొస్తున్న లైన్‌ను తొలగిస్తే పనులు వేగవంతం అవుతాయని చెప్పారు. వంతెన నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈఈ నాగేందర్, డీఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

# సఫిల్‌గూడ చెరువును అభివృద్ధి చేస్తాం


చెరువులో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: సఫిల్‌గూడ చెరువు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. సుమారు రూ. 11 లక్షలతో చేపట్టిన చెరువు చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు, గుర్రపుడెక్క తొలగింపు పనులను మంగళవారం ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెరువులోకి డ్రైనేజీ వదులుతున్న వారిని చైతన్యం చేయాలని, అప్పటికీ మారకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. సీవరేజ్ డైవర్షన్‌కు ప్రణాళికలు సిద్ధం చేయాలని, వాకింగ్‌ట్రాక్‌ను ఓ వైపు కాకుండా చెరువు చుట్టూ ఉండేలా నిర్మించడం వలన ఉపయోగకరంగా ఉంటుందని, అధికారులు ఆ దిశలో చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. డీఈ మహేష్, ఏఈ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంగళవారం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో స్థానికులు ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతి పత్రం అందజేశారు. స్థానికంగా పలు బస్తీలు, కాలనీల్లో సీసీరోడ్లు లేవని, వర్షం, మురుగు నీటికాలువల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోరారు. చాలా కాలనీల్లో ఓపెన్ జిమ్‌లు లేవని, పార్కులు అధ్వానంగా ఉన్నాయన్నారు. బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, ముద్దం శ్రీనివాస్‌యాదవ్, కొండల్‌రెడ్డి తదితరులున్నారు.



జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్

## చట్టసాధనకు దివ్యాంగుల సంతకాల సేకరణ



మల్కాజిగిరి: ఎన్‌పీఆర్డీ (వికలాంగుల హక్కుల జాతీయ వేదిక) తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మల్కాజిగిరిలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ జరిగింది. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుల్తాన్ రమేష్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో దివ్యాంగుల ప్రాతినిధ్యం కోసం చట్టసాధన చేయాలనే డిమాండ్‌తో లక్ష సంతకాల సేకరణ ఈనెల 30 వరకు జరుగుతుందన్నారు. దివ్యాంగులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వెంకటయ్య, మోజెష్, ఈశ్వరయ్య, నాయుడు, గోవిందరాజ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు చేయూత

రామంతాపూర్ : వివిధ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతూ ఫీజు కట్టే స్తోమతలేని 13 మంది విద్యార్థుల కళాశాల ఫీజులను మంగళవారం రామంతాపూర్ వెంకటరెడ్డినగర్‌లో సుప్రయూత్ ఫౌండేషన్ ఆర్థిక చేయూతనందించింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ గడ్డం సాయికిరణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం, ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు వార్షిక ఫీజులు మాఫీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫౌండేషన్ సభ్యులు శంకర్, హనుమంతరావు, సుధాకర్, సుదర్శన్‌రెడ్డి, వెంకటేష్‌గుప్తా, రంజిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు ఆర్థికసాయం చేస్తున్న దృశ్యం

# ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ కమిటిహాల్‌లో సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ కొడె పోచయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్లలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ప్రజల సంక్షేమానికి అహర్నిశలు పనిచేస్తానని తెలిపారు. డివిజన్‌లో గత ఐదేళ్లుగా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే సీనియర్ సిటిజన్ భవన నిర్మాణానికి కావాల్సిన నిధులను సమకూర్చి పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షుడు జె.లక్ష్మారెడ్డి, జనరల్ సెక్రటరీ లక్ష్మారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, ట్రెజరర్ హరినాథ్, బిక్షపతి, మురళీకృష్ణ, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, మల్లికార్జునరావు, హరినాథ్, జియల్‌చారి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.


మాజీ కార్పొరేటర్ పోచయ్యను సన్మానిస్తున్న దృశ్యం

# అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలి మృతి

మల్కాజిగిరి: అనుమానాస్పదస్థితిలో ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్ఎండీసీ కాలనీ గౌరీ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న సువర్ణలత వద్ద ఆమె తల్లి హీరాదేవి(77) గతేడాది నుంచి ఉంటోంది. ఈనెల 3న ఉదయం 10 గంటలకు సువర్ణలతతో పాటు ఆమె కుమారుడు అస్విన్‌తో కలిసి పనిమీద బయటకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగొచ్చిన అస్విన్ ఇంట్లో పొగ నిండి ఉండటంతో బెడ్రూమ్‌లోకి వెళ్లి చూడగా హీరాదేవి కాలిన గాయాలతో కనిపించింది. వెంటనే తల్లికి విషయం చెప్పగా ఆమె ఘటనా స్థలానికి చేరుకుని హీరాదేవిని రైల్వే ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అల్వాల్: విద్యుత్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా భూదేవినగర్ సబ్‌స్టేషన్ 11కేవీ మారుతీనగర్ ఫీడర్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మారుతినగర్ రోడ్డునెంబర్ 1 నుంచి 6 వరకు, ఈఎంఈ సిగ్నల్, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అధికారులు తెలిపారు.

మేడిపల్లి: 11కేవీ ఆర్టీసీ కాలనీ ఫీడర్ పరిధిలో సమ్మర్ యాక్షన్‌ప్లాన్ పనుల మరమ్మతుల కారణంగా 33/11కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు గణేష్‌నగర్, ఇంద్రానగర్, బృందావన్‌కాలనీ, సుశీలాటౌన్‌షిప్, హరిప్రియ కాలనీ, శివశక్తినగర్, మాతా అరవిందకాలనీలలో కరెంట్ ఉండదని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

◆ 11 కేవీ మై విల్లాస్ ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మలు తొలగింపు, మరమ్మత్తుల కారణంగా 33/11కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కాకతీయకాలనీ, జయశ్రీకాలనీ, కమలానగర్, చిన్న క్రాంతికాలనీ, అరవిందఎన్‌క్లేవ్, యాదయ్యనగర్‌కాలనీ, రామకృష్ణానగర్, మైవిల్లాస్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ హరినాథ్ సగ్గు ఓ ప్రకటనలో కోరారు.

ఉప్పల్: ఘట్‌కేసర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉప్పల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఏఈ నిఖిల్ తెలిపారు. ఉప్పల్ అన్నపూర్ణ కాలనీ, బీరప్పగడ్డ, ఓల్డ్‌భరత్‌నగర్, న్యూ భరత్‌నగర్, శ్రీనగర్‌కాలనీ, కావేరినగర్ ధర్మపురి కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. శ్రీసాయినగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3 గంటల వరకు శ్రీశ్రీనగర్, మల్లికార్జుననగర్, ఆదర్శనగర్, గాంధీనగర్, స్వరూప్‌నగర్, సెవన్‌హిల్స్‌కాలనీ, భరత్‌నగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రామంతాపూర్: విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శ్రీనివాసపురం విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు శ్రీనివాసపురం, యాదయ్యహోటల్, నవరంగ్‌గూడ, వివేక్‌నగర్, వెంకటరెడ్డినగర్, కామాక్షిపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, పీఎస్‌కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాలిటెక్నిక్ సబ్‌స్టేషన్ శ్రీనివాసపురం పీఎస్‌కాలనీ, మధురానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని సబ్‌స్టేషన్ ఏఈ లావణ్య కోరారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220376 9912220571
9912225470 9505507657